సాక్షి విశాఖపట్నం

సోమవారం । 5 । ఆగస్టు । 2024



72 కేసుల్లో 108 మంది అరెస్ట్

జూలైలో జరిగిన నేరాలు, సొత్తు స్వాధీనంతో పాటు నిందితుల అరెస్టు తదితర వివరాలను సీపీ శంఖబత్ర బాగ్చీ వివరించారు. 8లో



ఓవరాల్ చాంప్ మహారాష్ట్ర

జాతీయ 7వ క్యాడెట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఓవరాల్ చాంప్‌గా మహారాష్ట్ర నిలిచింది. 8లో



సిటీలో డబుల్ ఇస్మార్ట్

డబుల్ ఇస్మార్ట్ యూనిట్ నగరంలో ఆదివారం సందడి చేసింది. గురజాడ కళాక్షేత్రంలో సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో రామ్, చిత్ర హీరోయిన్ కావ్య థాపర్, హాస్యనటుడు అలీ హాజరయ్యారు. 8లో

• రామకథను వినరయ్యా..



రామాయణ ఘట్టాలపై విదేశీ విద్యార్థుల ప్రదర్శన అలరించింది. రామాయన్ పేరుతో సాహిత్య ప్రదర్శన కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. 8లో

• మెరిశారీలా...



చీర ప్రాముఖ్యతను విశాఖ మహిళలు మరోసారి చాటిచెప్పారు. ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో హ్యాండ్లూం శారీ వాక్ నిర్వహించారు. 8లో

• సాగర తీరంలో స్నేహగీతం



ఫ్రెండ్‌షిప్ డే సైగా ఆదివారం. ఇంకేముంది సాగరతీరం స్నేహితుల తీరంగా మారిపోయింది. ఆటపాటలు, సెల్ఫీలు, ముచ్చట్లతో ఉత్సాహంగా గడిపారు. 8లో

చదువుకు చెదలు

- ఇప్పటికీ అందని పుస్తకాలు, యూనిఫాం, షూ
- కానుకలు పంపిణీలో కూటమి రాజకీయం
- మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ కరువు
- ప్రభుత్వ స్కూళ్లలో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

విశాఖ విద్య : ప్రభుత్వ విద్యా వ్యవస్థకు చెదలు పడుతున్నాయి. గత విద్యాసంవత్సరం వరకు వేడుకగా సాగిన చదువులు నిస్తేజంగా సాగుతున్నాయి. ఇప్పటికీ 70 శాతం మంది విద్యార్థులకు యూనిఫాంలు అందలేదు. చాలా వరకు పుస్తకాలు పంపిణీ చేయలేదు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు ప్రతి రోజు పుస్తకాలు, బ్యాగులు, ఇతర విద్యా సమగ్రిని సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ప్రైవేటు యాజమాన్యాలకు పెద్దపీట వేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయాయి. పరిస్థితులు ఇలానే ఉంటే భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు.



హెచ్‌బీ కాలనీలో యూనిఫాం లేకుండా ఉన్న విద్యార్థులు

ఉపాధ్యాయుల కొరత



నడుపూరు జెడ్పీ పాఠశాలలో...

జిల్లాలో 3,488 శాంక్షన్ పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ, ఎంపీపీ, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలో టీచింగ్, నాన్ టీచింగ్ కలుపుకొని ఇంకా 255 పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. మరికొన్ని స్కూళ్లలో అదనపు ఉపాధ్యాయులు ఉన్నారు. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. కానీ ఉపాధ్యాయల సర్దుబాటుపై ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవటంతో పాఠ్యాంశాల బోధన సాగక, విద్యార్థులు చదువుల్లో వెనుకబడుతున్నారు.

డిజిటల్ చదువులపై శ్రద్ధ ఏదీ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా చదువులు అందించాలనే ఉన్నతాశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డిజిటలైజేషన్‌కు పెద్ద పీట వేసింది. దీనిలో భాగంగా 2022–23 విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను అందించారు. జిల్లాలో 23,011 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అదే విధంగా 498 స్మార్ట్ టీవీలు, 1,206 ఇంటరాక్టివ్ ప్లాట్ ఫామ్(ఐఎఫ్‌పీ)లను అందజేశారు. కానీ ఈ విద్యా సంవత్సరంలో వీటి వినియోగంపై ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదు. చాలా స్కూళ్లలో వీటిని వినియోగించటం లేదు.



వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో నిరుపయోగంగా ఉన్న ఐఎఫ్‌పీ

ప్రభుత్వ స్కూళ్లకు తగ్గుతున్న ఆదరణ

2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పరిధిలోని 608 స్కూళ్లలో 95,128 మంది విద్యార్థులు, 777 ప్రైవేట్ పాఠశాలల్లో 2,96,878 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు నివేదించారు. 2024–25 విద్యా సంవత్సరంలో తాజా గణాంకాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 73,010 మంది విద్యార్థులు నమోదయ్యారు. యు డైస్ ప్లస్ పోర్టల్‌లో విద్యార్థుల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నందున కొద్దిగా పెరిగే అవకాశం ఉన్నప్పటకీ, గత ఏడాది మార్కును చేరుకోవటం కష్టమేనని ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. అదే ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికే 2,64,465 మంది విద్యార్థులు ఉన్నట్లు యు డైస్ ప్లస్ పోర్టల్‌లో చూపిస్తున్నారు. ఈ సంఖ్య చాలా వరకు పెరిగే అవకాశం ఉంది.



భోజనం రుచి తగ్గుతోంది



వెంకటాపురం స్కూల్లో..

జిల్లాలోని 450 ప్రాథమిక, 37 ప్రాథమికోన్నత, 95 ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. మొత్తంగా జిల్లాలో 79,857 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. అయితే ప్రస్తుతం 62 వేల మంది వరకు మాత్రమే స్కూళ్లలో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మిగతా విద్యార్థులంతా బడిలో భోజనం చేస్తున్నారా అనేది ప్రశ్నార్థకం. అయితే మధ్యాహ్న భోజనం రుచికరంగా లేకపోవటంతో చాలా మంది విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు.

నేటికీ అందని కానుక

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ప్రారంభించిన తొలిరోజునే 'జగనన్న విద్యాకానుక' పంపిణీ జరిగేది. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, షూలు ఇలా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కిట్‌ను అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచి రెండు నెలలు సమీపిస్తున్నా నేటికీ సవ్యంగా విద్యాకానుకలు అందజేయలేదు. చాలా మంది విద్యార్థులు యూనిఫాం, షూలు లేకుండానే పాఠశాలలకు వస్తున్నారు.



షూ లేకుండా ఉన్న విద్యార్థినులు

కూటమి నేతల వల్లే..

ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందని ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన నేపథ్యంలో పుస్తకాల పంపిణీలో కూడా స్థానిక కూటమి నేతలు భాగస్వాములవుతున్నారు. పంపిణీ ఆలస్యం అవడానికి ఇది కూడా ఓ కారణం. రెండు నెలలుగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ ప్రహసనంగా సాగుతోంది. ఈ నెలాఖరున ఫార్మేటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పుస్తకాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

- గోపాలపట్నం మండలం హెచ్‌సీ వెంకటాపురం ప్రైమరీ స్కూల్లో 51 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది ఇక్కడ 68 మంది విద్యార్థులు ఉండేవారు.
- హెచ్‌బీ కాలనీ స్కూల్లో 1 నుంచి 5 తరగతులకు గాను 175 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ గతేడాది 198 వరకు ఉండేవారు.
- 61వ వార్డు ప్రకాష్‌నగర్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఐదుగురు హిందీ టీచర్లు అవసరం కాగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. అలాగే తెలుగుకు నలుగురు ఉపాధ్యాయులు అవసరం ఇద్దరు ఉన్నారు.
- సబ్బవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది 4,500 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య సుమారు 4,100గా ఉంది.
- జీవీఎంసీ 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించినట్లు పలువురు విద్యార్థులు చెబుతున్నారు.
- యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 230 మంది విద్యార్థులు చదువుతుండగా.. 11 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో అన్ని తరగతులకు బోధన కష్టతరంగా మారింది.
- పెదగంట్యాడ మండలం నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 1,870 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల కొరత ఉంది.
- గోపాలపట్నం మండల పరిధిలోని 18 ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది 646 మంది విద్యార్థులు చేరారు. గతేడాది సుమారు 1200 మందికి పైగా చేరారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు 6న నోటిఫికేషన్ జారీ

మహారాణిపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఈనెల 6వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుంది. వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ మారడంతో ఆయనపై అనర్హత వేటు పడింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మంగళవారం ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 14న స్క్రూటినీ, 16న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. 30వ తేదీన పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది.

నేడు కలెక్టరేట్, జీవీఎంసీ పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) రద్దు చేశారు. కలెక్టరేటర్, జీవీఎంసీ, పోలీసు కమిషనరేట్‌లో జరగాల్సిన పీజీఆర్ఎస్ రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుంది. జీవీఎంసీ పరిధిలోని అన్ని జోనల్ కార్యాలయాల్లో కూడా పీజీఆర్ఎస్ రద్దు చేశారు. ప్రజలు గమనించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ల సదస్సుకు దూరం

మహారాణిపేట: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందుకు సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సుకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ హాజరుకావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న సదస్సుకు హాజరు కావాలా? వద్దా అని ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ లేఖ రాయగా.. ఎలాంటి అనుమతులు రాలేదు. దీంతో సమావేశానికి హాజరుకావడం లేదు.

గుండెలదిరినై..



కోర్బా ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల్లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, రైల్వే సిబ్బంది

- 6.30 గంటలకు రైల్వే స్టేషన్‌కు వచ్చిన కోర్బా–విశాఖ ఎక్స్‌ప్రెస్
- 9.40 గంటలకు అగ్నికీలల్లో బూడిదైన బీ–7, మరో రెండు కోచ్‌లు
- ప్రయాణికులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న విశాఖ
- పవర్ సప్లయ్ లేకపోయినా ప్రమాదమెలా జరిగింది?
- ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్
- నేడు ఆర్‌డీఎస్‌వో, ఐసీఎఫ్ బృందాల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం :

సాగరాన్ని చీల్చుకుంటూ.. సూరీడు రాకతో విశాఖ నిద్రలేచింది.

నిరంతరం సందడిగా ఉండే వాల్తేరు రైల్వేస్టేషన్ ఎప్పటిలాగానే ప్రయాణికులతో కిటకిటలాడుతోంది.

అప్పుడే నాలుగో నంబర్ ప్లాట్‌ఫారానికి వచ్చిన కోర్బా–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రయాణికులు దిగి ఇళ్లకు వెళ్లిపోయారు.

మధ్యాహ్నం మళ్లీ తిరుపతి వెళ్లేందుకు రెడీ చేయాలనే ఉద్దేశంతో సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నారు.

ఉదయం 9.40 గంటలకు కలకలం మొదలైంది..

బీ–7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి పొగలు వస్తున్నట్లు పహారా కాస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుర్తించారు.

కోచ్ దగ్గరికి సిబ్బంది చేరుకునేలోపే.. మంటలుగా చెలరేగి కోచ్ మొత్తం వ్యాపించాయి.

5వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు.

వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించారు. కానీ ఫలితం లేదు. 10.10 గంటలకు ఫైర్ బ్రిగేడ్స్ చేరుకున్నాయి.

ఇంతలోనే బీ–7కి ఇటు అటు ఉన్న బీ–6, ఎం–1 కోచ్‌లకు మంటలు వ్యాపించేశాయి. ఓ వైపు అగ్నిమాపక సిబ్బంది, మరోవైపు ఆర్‌పీఎఫ్ సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమించారు.

దాదాపు 2 గంటల తర్వాత మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదం జరిగినప్పుడు రైలులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.





ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన బి–7కోచ్ బెర్తులు



ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ



కొత్త బి–7 కోచ్‌తో మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్

పవర్ లేనప్పుడు ప్రమాదమెలా జరిగింది?

ఉదయం 6.30 గంటలకు కోర్బా–విశాఖపట్నం (18517) ఎక్స్‌ప్రెస్ విశాఖ చేరుకుంది. 7.30 గంటలకు ట్రైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కోచింగ్ డిపోకు ఈ ఖాళీ రైలును పంపించే ముందు.. ఏసీ కోచ్‌ల్లో ఉన్న బ్లాంకెట్స్ తీసివేయడం, లైట్లు, ఫ్యాన్స్ స్విచ్‌లు ఆపడం, స్లీపర్, జనరల్ కోచ్‌ల్లో విండో గ్లాస్‌లు దించే పని ప్రారంభించారు. ప్రమాదం జరిగింది ఉదయం 9.40 గంటలకు. అంటే దాదాపు రెండు గంటల ముందే ట్రైన్‌కు పవర్ సప్లయ్ నిలిచిపోయింది. కానీ బీ–7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి మంటలు వ్యాపించడంపై అందర్లోనూ అనుమానాలు కలుగుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ అయ్యే ఛాన్స్‌లేదు. కానీ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో అధికారులకు అంతు చిక్కడం లేదు. చివర్లో ఎవరైనా ఆకతాయిలు దిగినప్పుడు సిగరెట్ తాగి పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ఇప్పటికే సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ ఈ ఎక్స్‌ప్రెస్‌లో మాత్రం సీసీ కెమెరాలు లేకపోవడంతో అధికారులు లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంటుంది.

నేడు దర్యాప్తు బృందాల రాక

ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై ఇంత వరకూ ప్రాథమిక అంచనాకు రాలేదని వాల్తేరు డివిజన్ అధికారులు చెబుతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ప్రమాదానికి గురైన కోచ్‌లను కూడా మెయింటెనెన్స్ డిపోకి తరలించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, ఇతర రైల్వే అధికారులు ఘటనా స్థలికి చేరుకొని సమీక్షించారు. ప్రమాదంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. లక్నోలో ఉన్న రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్(ఆర్‌డీఎస్‌వో), చెన్నై నుంచి ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్) బృందాలు సోమవారం వచ్చి ఆధారాలు సేకరించనున్నాయి. అదేవిధంగా ప్రమాదంపై విచారణ చేపట్టేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు విశాఖకు సోమవారం రానున్నారు.




బీ7 కోచ్‌లో ఎగిసిపడుతున్న మంటలు

మెయింటెనెన్స్ లోపమా.?

వాస్తవానికి ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల మెయింటెనెన్స్ ఈ మధ్య సరిగా ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి కోచ్‌ల పరిశుభ్రత, నిర్వహణ విషయంలో కాస్తా అలసత్వం ప్రదర్శిస్తున్నారని.. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా రైళ్లలో ఉండే ప్రైవేట్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ఉదాసీనంగా ఉండటం వల్లే లోపల షార్ట్ సర్క్యూట్ జరిగి నెమ్మదిగా మంటలు వ్యాపించి ఉంటాయేమోనన్న వాదనా వినిపిస్తోంది..

అంతలోనే మంటలు


– ప్రత్యక్ష సాక్షి



మేము ఈ ప్లాట్‌ఫాంపై పనిచేస్తుంటాం. ఎదురుగా పొగ వస్తోందని మాట్లాడుకుంటుంటే అక్కడికి వెళ్లాం. అంతలోనే మంటలు వ్యాపించాయి. జనాలు ఒక్కసారిగా పరిగెత్తారు. పోలీసులు, ఫైర్ వాళ్లు వచ్చి మంటల్ని అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు.

భయపడిపోయాం..

– ప్రత్యక్ష సాక్షి



మంటలొస్తున్నాయని చెబుతుంటే అక్కడికి వెళ్లాం.. ట్రైన్ మొత్తం తగలబడిపోతున్నట్లు కనిపించింది. మేం సాయం చేయాలని ప్రయత్నించాం. కానీ.. పోలీసులు ఆపేశారు. జనాలు లేరు కాబట్టి ఘోరం జరగలేదు.

మెరి'శారీ'లా..



చీరతో 'షి'ంగారం



మహిళానందం



ఫ్యాషన్ వాక్..

- సాగరతీరంలో హ్యాండ్లూం శారీ వాక్
- పదివేల మంది హాజరు
- అదిరిన ఫ్యాషన్ వాక్

సింగారమనే దారంతో చేసి, ఆనందమనే రంగులను అద్ది, మమకారమనే మగ్గంపై నేసిన చీరకు తిరుగేముంది? చీర పవిత్రతను సూచిస్తుంది, మన సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది, దెబ్బ తగిలి రక్తం కారితే సర్రున చిరిగేది..అమ్మమ్మ కట్టే ముతక చీర. ఏడ్చే కళ్లని తుడిచి ఓదార్పును అందించేది.. ఆత్మీయత నిండిన అమ్మ చీర. ప్రేమాభిమానాల్ని, వెలకట్టలేని అనురాగాన్ని అపురూపంగా మూట కట్టి ఇచ్చేది.. ఆడపడుచుకు పెట్టే పట్టుచీర. ఇంతటి చీర ప్రాముఖ్యతను విశాఖ మహిళలు మరోసారి చాటిచెప్పారు.

బీచ్‌రోడ్డు : ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని హ్యాండ్లూం శారీ వాక్‌ను హోంమంత్రి అనిత ప్రారంభించగా పదివేల మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ చీరకట్టు అనాదిగా వస్తున్న సంప్రదాయమని, చీరలో అమ్మతనం, కమ్మతనం ఉంటుందన్నారు. చేనేత కార్మి కులను ప్రోత్సహిస్తూ శారీ వాక్ నిర్వహించడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకుంటామన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ చీరకట్టు మన దేశ సంప్రదాయమన్నారు. అటువంటి చీరకట్టుకొని సుమారు 10వేలు మంది ఈ వాక్‌లో పాల్గొనటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీఎస్ఈజెడ్ అధికారి రోషిణి, ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ సభ్యులు దొరబాబు, డాక్టర్ పద్మశ్రీ,వినయ్, శేఖర్, లలిత శ్రీనువాస్ తదితరులు హోం మంత్రి వంగలపూడి అనితను ఘనంగా సత్కరించారు. పలు కాలేజీల విద్యార్థినులు, పలు సంస్థల ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో శారీ వాక్‌లో పాల్గొన్నారు. చీర గొప్పతనం తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులకు అండగా ఉండేందుకు వారు రూపొందించిన వస్త్రాలను ధరించి ఫ్యాషన్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి అడుగులు చీరను ప్రదర్శించారు.





చేనేత చీర..సెల్ఫీ ముచ్చట



శారీవాక్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, నిర్వాహకులు

సాగరతీరంలో స్నేహగీతం



గాల్లో తేలినట్టుందే...: స్నేహితుల దినోత్సవం సందర్భంగా మహిళల కేరింతలు

బీచ్‌రోడ్డు : ఫ్రెండ్‌షిప్ డే. పైగా ఆదివారం. ఇంకేముంది అందాల సాగరతీరం.. స్నేహితుల తీరంగా మారిపోయింది. శుభాకాంక్షల వెల్లువలు.. కేక్ కటింగ్‌లు.. ఆటపాటలు.. సముద్ర స్నానాలు.. సెల్ఫీలు... వాట్సాప్ షేరింగ్‌లు...ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్స్... ఒకటే ముచ్చట్లతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. అలల వయ్యారాలు... యువత కేరింతలతో సాగరతీరంలో సందడి నెలకొంది.



మిత్రబృందం కేక..



ప్రేమతో : స్నేహితుల దినోత్సవం



ఉన్నది ఒక్కటే జిందగీ..: ఉత్సాహం ఉరకలెత్తాలిలా

ఆధునిక జీవన శైలితో రక్తనాళాల రుగ్మతలు

- సీపీ శంఖబ్రత బాగ్చి
- బీచ్ రోడ్డులో వాస్కులర్ వాక్

బీచ్‌రోడ్డు: ప్రపంచంలో నేడు నెలకొన్న ఆధునిక జీవనశైలితో ఎక్కువ మంది రక్తనాళాల రుగ్మతలకు గురవుతున్నారని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కనీస శారీరక సామర్థ్యం లేకపోవడం వల్ల రక్తనాళాల రుగ్మతలు వస్తున్నాయన్నారు. జాతీయ వాస్కులర్ డే సందర్భంగా వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (వీఎస్ఐ) విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం వాకథాన్ నిర్వహించారు. బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్కేబీచ్ వరకు సాగిన వాక్‌థాన్‌ను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ తొలగింపును నివారించాల్సిన ఆవశ్యకత, దాని వల్ల కలిగే ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వాస్కులర్ -ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ దివాకర్ బెండి మాట్లాడుతూ రక్తనాళాల రుగ్మతలపై అవగాహన పెంచేందుకే వాక్ నిర్వహించామన్నారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ డాక్టర్ తపిష్ సాహు మాట్లాడుతూ అవయవ తొలగింపు రహిత భారత దేశం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అద్భుత స్పందన రావడం చాలా ఆనందంగా ఉందని వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ పీసీ గుప్తా అన్నారు.



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

రామకథను వినరయ్యా..

- విదేశీ విద్యార్థుల నోట రాముని పాట
- రామాయణ ఘట్టాలపై అద్భుత నృత్య ప్రదర్శన



బీచ్‌రోడ్డు: శభాష్.. పాత్రధారణ అంటే ఇలా ఉండాలి! అందం, హావభావాలతో వారు సీతారాములను తలపించారు. రాముడు, సీత జననం, వారి బాల్యం, విద్యాభ్యాసం, స్వయంవరం, 14 ఏళ్ల వనవాసం, రావణుడిపై విజయం లాంటి సన్నివేశాలతో విదేశీ విద్యార్థులు అబ్బురపరిచారు. విదేశీ విద్యార్థులు రామాయణ ఘట్టాలను అవగతం చేసుకుని ఆయా పాత్రల్లో ఒదిగిపోయారు. ఆద్యాంతం అద్భుతంగా నటించి మెప్పించారు. రామాయణంలో దాగి ఉన్న సంస్కృతీసంప్రదాయలను పాట..నృత్య రూపంలో విదేశీ విద్యార్థుల ప్రదర్శన అద్భుతంగా సాగింది. ప్రపంచ వ్యాప్తంగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రచారం చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్, సూరతి సంయుక్తంగా రామాయన్ పేరుతో సంగీత సాహిత్య ప్రదర్శనను ఆదివారం ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఏయూ ఇంటర్నేషనల్ డీన్ ఈఎస్ ధనుంజయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూలో చదువుతున్న వివిధ దేశాల విద్యార్థులకు రామాయణంలోని ఇతిహాసాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడిందన్నారు. సూరతి వ్యవస్థాపకురాలు రిప్లీ మాట్లాడుతూ రామాయణం ఇతిహాస సారాంశాన్ని మరో నూతన కోణంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. రామాయణం అద్భుత కథాంశాన్ని అందంగా, వైవిధ్యంగా, సందేశాత్మకంగా మ్యూజికల్ థియేటర్, ఒపేరా, జాజ్ , సమకాలీన సంగీత ప్రక్రియలతో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇండియాన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్ రీజినల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో విదేశీ విద్యార్థులు

సాక్షి క్లాసిఫైడ్స్

FLATS FOR SALE
2 BHK, 1050 Sft. 40 LAKHS
3 BHK, 1610 Sft. 60 LAKHS
Few Flats available NO GST
DVR CLASSIC
Madhurwada, Near Ayodhya Nagar
9989066678

CHANGE OF NAME
I, ANANDA TANWAR W/o Ashwani Kumar Tanwar Previoulsy called ANANDA SINGH, Resident of E-5/88, Chitrakoot Yojana Ajmer Road, Vaishali Nagar, Jaipur, Rajasthan - 302021, Now Changed my name from ANANDA SINGH to ANANDA TANWAR. Henceforth I will be called as ANANDA TANWAR for all purpose

Real Estate

PLOT FOR SALE
■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 93985 76997 [B-48]

■ కావలెను : 1000 Hours ల్యాబ్ టెక్నీషియన్ ఫ్రీ జాబ్ కోచింగ్ స్టైఫండ్‌తో ఉద్యోగాలు ఇంటర్ సైన్స్‌తో పాస్ అప్లై Age : 18-34 - అపోలో, కేర్, సెవెన్ హిల్స్, పినాకిల్, మెడికవర్, KGH, వైజాగ్‌లో. ఫోన్ : 63046 20848, 80746 99673 [V- 6530]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185276]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796263]

www.sakshi.com

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12256]

Wanted
■ మధురవాడ నందు ఆఫీసు అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేయుటకు 2 సం॥ అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ మరియు అసిస్టెంట్ అకౌంటెంట్స్ కావలెను. ఫోన్ : 94947 11811, pardhumgt@gmail.com [V- 776867]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

డబుల్ ఇస్మార్ట్ మరింత ఊర మాస్

- చిత్ర హీరో రామ్ పోతినేని
- ట్రైలర్ విడుదల
- సందడి చేసిన చిత్ర యూనిట్



ట్రైలర్ విడుదలలో పాల్గొన్న రామ్, కావ్యథాపర్, అలీ, భద్రం తదితరులు

బీచ్‌రోడ్డు: ఇస్మార్ట్ శంకర్ పక్కామాస్ సినిమా..నా కెరీర్‌లో సూపర్ హిట్‌గా నిలిచింది..డబుల్ ఇస్మార్ట్ అంతకు మించి ఊరమాస్ లెక్క ఉంటుందని ఎనర్జటిక్ హీరో రామ్ పోతినేని పేర్కొన్నారు. ఆదివారం గురజాడ కళాక్షేత్రంలో డబుల్ ఇస్మార్ట్ ట్రైలర్‌ను విడుదల చేశారు. రామ్‌తో పాటు చిత్ర హీరోయిన్ కావ్య థాపర్, హాస్యనటుడు అలీ హాజరయ్యారు. ఈసందర్భంగా రామ్ మాట్లాడుతూ పూరీ జగన్నాథ్ క్రియేటివ్ డైరెక్టర్. ఆయనతో పనిచేస్తే ఆ కిక్కే వేరు. ఇస్మార్ట్ శంకర్ కథ రాస్తున్నప్పుడు పదేళ్లు ఆ పాత్ర గుర్తుండిపోతుందనుకున్నాం..నిజంగా ఆ పాత్రకు అంతపేరొచ్చింది. డబుల్ ఇస్మార్ట్ మాస్ ఎంటర్‌టైనర్. కమర్షియల్ హంగులతో ఆగస్టు 15న విడుదలకు సిద్ధమవుతుందన్నారు. విశాఖ వాసులు సినిమా ప్రియులు. ఇక్కడ మంచి టాక్ వస్తే సినిమా సూపర్ హిట్ అయినట్టే లెక్క. సెన్సార్ పనుల కారణంగా దర్శకుడు పూరీ జగన్నాథ్ రాలేకపోయారని, విశాఖలో విజయోత్సవ సభకు కచ్చితంగా వస్తారన్నారు.

72 కేసుల్లో 108 మంది అరెస్ట్

- రూ.45.64 లక్షల సొత్తు స్వాధీనం
- 16 మంది మైనర్లు, 92 మంది నిందితుల అరెస్ట్
- పోలీస్ కమిషనర్ శంఖ బత్ర బాగ్చి

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై నెలలో 97 నేరాలు జరగగా, రూ.59,24,906 లక్షలు విలువ గల ఆస్తి దోపిడీకి గురైందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబత్ర బాగ్చి తెలిపారు. వాటిలో 72 కేసులు దర్యాప్తు చేపట్టి , 108 మందిని అరెస్టు చేశామన్నారు. వీరిలో 16 మంది మైనర్లున్నారన్నారు. వీరి నుంచి రూ.45,63,715 లక్షలు విలువ గల ఆస్తి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆదివారం నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు నగర జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఫకీరప్ప సూచనలు, సలహాల మేరకు నగర క్రైం డీసీపీ వెంకటరత్నం పర్యవేక్షణలో క్రైం టీమ్ దర్యాప్తు చేపట్టి 887.09 గ్రాముల బంగారు ఆభరణాలు, 5.3 కేజీల వెండి, రూ.13,30,050, 16 మోటారు సైకిల్స్, 2 ఆటోలు, 271 మొబైల్ ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, 3 ఆంప్లిఫైర్స్, 100 మీటర్ల కాపర్ వైర్, ఒక రిఫ్రిజిరేటర్ స్వాధీనం చేసుకున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని సీపీ శంఖబత్ర బాగ్చి వెల్లడించారు. జూలై నెలలో 355 సీసీ కెమెరాలు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. నేర నియంత్రణపై 168 అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశామని, రాత్రి సమయాల్లో క్రైం టీమ్‌లు ద్వారా నిరంతరం పెట్రోలింగ్ చేపడుతున్నామన్నారు.

252 మొబైల్స్ రికవరీ : మొబైల్స్ పోగొట్టుకున్న వారి ఫిర్యాదు మేరకు ఏర్పాటు చేసిన చాట్‌బాట్, సీఈఆర్ సిస్టమ్స్ ద్వారా జూలైలో రూ.37.80 లక్షల విలువ గల 252 మొబైల్స్‌ను రికవరీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.4.49 కోట్ల విలువగల 2,999 మొబైల్స్ రికవరీ చేశామన్నారు. వాటిని బాధితులకు సీపీ స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో నగర క్రైం డీసీపీ వెంకటరత్నం, క్రైం ఏసీపీలు, సీఐలు, ఎస్.ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రికవరీ అయిన ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఓవరాల్ చాంప్ మహారాష్ట్ర

- రన్నరప్‌గా ఉత్తరప్రదేశ్
- విశాఖలో ముగిసిన జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్

విశాఖ స్పోర్ట్స్ : జాతీయ 7వ క్యాడెట్ కోరుగి, పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్ మేల్ క్యాడెట్‌లో మహారాష్ట్ర 84 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌గా నిలవగా ఉత్తరప్రదేశ్ 81 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. జట్ల వారీగా సర్వీసెస్, ఫిమేల్ క్యాడెట్‌లో అసోం జట్లు విజేతలుగా నిలిచాయి. సర్వీసెస్ జట్టు 57 పాయింట్లు సాధించగా అసోం జట్టు 62 పాయింట్లతో ఆధిక్యాన్ని ప్రదర్శించి ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. మేల్ క్యాడెట్‌లో 53 పాయింట్లతో ఉత్తరప్రదేశ్ రన్నరప్‌గా, 39 పాయింట్లతో బీహార్ సెకండ్ రన్నరప్‌గా నిలవగా...ఫిమేల్ క్యాడెట్‌లో మహారాష్ట్ర 54 పాయింట్లతో రన్నరప్‌గా, ఉత్తరాఖండ్ 37 పాయింట్లతో సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. తైక్వాండో సమాఖ్య పర్యవేక్షణలో ఏపీ తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో విశాఖలోని పోర్ట్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు కోరుగి, పూమ్‌సేల్లో జరగ్గా 29 రాష్ట్రాలకు చెందిన తైక్వాండియన్స్ మేల్,ఫిమేల్ క్యాడెట్ పదేసి విభాగాల్లో పోటీపడ్డారు. బెస్ట్ ఫైటింగ్ స్పిరిట్‌ను మేల్ క్యాడెట్‌లో రాజస్థాన్ జట్టు ప్రదర్శించగా ఫిమేల్ క్యాడెట్‌లో తమిళనాడు జట్టు ప్రదర్శించింది. మేల్ క్యాడెట్‌లో హర్యానా జట్టు, ఫిమేల్ క్యాడెట్‌లో చండీగఢ్ జట్టు యాక్టివ్ పార్టిసిపేషన్ జట్లగా నిలిచాయి. సమాఖ్య, సంఘం ప్రతినిధులే విజేతలకు ట్రోఫీలందించారు. ఏపీ తైక్వాండో సంఘం అధ్యక్షుడు పోటీలను పర్యవేక్షించగా సమాఖ్య కోశాధికారి జస్బీర్‌సింగ్, చాంపియన్‌షిప్ అబ్జర్వర్ దోర్జె, సంఘం ప్రతినిధులు శ్రీను, సలాం, డీవీ చారి, లక్ష్మీనారాయణ, గణేష్,మురళీ, శేఖర్ పాల్గొన్నారు.

స్వర్ణవిజేతలు వీరే... : పూమ్‌సే గ్రూప్ మేల్ క్యాడెట్ ఈవెంట్‌లో అసోంకు చెందిన సిమాంతదాస్, సుమన్ ఖలితా, సామియుల్, తంగు విజేతలుగా నిలిచారు. ఫిమేల్ క్యాడెట్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన తెర్ దిమిన్,నోవే వాంగ్‌షూ,మినక్ తముక్ విజేతలుగా నిలిచారు. మొత్తంగా పదేసి కేటగిరీల్లో కోరుగి పోటీలు జరగ్గా చివరి రోజు ఆదివారం మేల్ క్యాడెట్‌లో రచిత్ మౌర్య(ఉత్తరప్రదేశ్), హెంబా మీతి (మణిపూర్), ఫిమేల్ క్యాడెట్‌లో గర్గి భకాల్కర్ (మహారాష్ట్ర) దివ్యానా హాల్కి(అసోం) ఆయా కేటగిరీల్లో విజేతలుగా నిలిచారు.

బాలుడిపై పోక్సో కేసు

కొమ్మాది : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం... ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కళ్లివానిపాలెం గ్రామానికి చెందిన ఓ బాలిక కడుపులో నొప్పి వస్తుందని తల్లికి చెప్పగా... ఆ బాలిక తల్లి ఆదివారం ఉదయం కేజీహెచ్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించడంతో గర్భవతిగా తేలింది. దీనికి కారణం ఎవరని ప్రశ్నించగా అదే ప్రాంతానికి చెందిన 17 సంవత్సరాల బాలుడు కారణమని బాలిక తెలిపింది. దీనిపై బాలిక తల్లి ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇద్దరు మైనర్లే కావడంతో బాలుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

స్నేహితుల దినోత్సవం వేళ విషాదం

- గంభీరం రిజర్వాయర్‌లో జారిపడి గీతం విద్యార్థి మృతి

తగరపువలస : స్నేహితుల దినోత్సవం వేళ విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు వెళ్లిన స్నేహితుల్లో ఒకరు కాలు జారి గంభీరం రిజర్వాయర్‌లో పడిపోవడంతో మునిగిపోయి మృతిచెందాడు. ఈ దుర్ఘటన ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ వద్ద జరిగింది. గీతం విద్యార్థి డోకి నిరంజన్ కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా నిరంజన్‌తోపాటు మరో నలుగురు విద్యార్థులు ఆశిష్, రిహాన్, లలిత్, మోహిత్ సరదాగా గడపడానికి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. రిజర్వాయర్ మధ్యలో గట్టుపై నడుస్తుండగా నిరంజన్‌తోపాటు ఆశిష్, రిహాన్ కాలు జారి పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానికులతో పాటు మిగిలిన స్నేహితులు ఆశిష్, రిహాన్‌ను రక్షించగా నిరంజన్ మునిగిపోవడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆశిష్‌కు గాయాలు కాగా ఆనందపురం పోలీసులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరంతా గీతం కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పలాస. అతని తండ్రి దుస్తుల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. నిరంజన్ మృతి విషయం తెలుసుకున్న స్నేహితులు గంభీరం రిజర్వాయర్ వద్దకు, ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ టీవీ తిరుపతిరావు మృతుని కుటుంబ సభ్యులకు వివరాలు తెలియచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు నిరంజన్

6వ తరగతి విద్యార్థి మృతి

బీచ్‌రోడ్డు: స్నేహితుల దినోత్సవం రోజు విషాదం చోటు చేసుకుంది. మాధవదార ప్రభుత్వ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న బొంతల ప్రవీన్ కుమార్ (10) స్నేహితులతో కలిసి విక్టరీ ఏట్ సీ ఎదురుగా ఉన్న బీచ్‌లో సరదాగా గడిపేందుకు వచ్చారు. అంతా సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల ఉధృతికి ప్రవీన్ కొట్టుకుపోయాడు. మిగిలిన వారు కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న బీచ్ లైఫ్ గార్డ్స్ ప్రవీన్ కుమార్‌ను అతి కష్టం మీద ఒడ్డుకు తీసుకొని వచ్చారు. అప్పటికే పూర్తిగా నీరు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



ప్రవీన్‌కుమార్ (ఫైల్)